


# దొంగ

**పి.సత్యవతి**

"కాథరీన్-ప్లీజ్ స్టాండ్ అప్" మల్లెపువ్వులాంటి తెల్లటి చీర కట్టుకున్న టీచరు, కాథరీన్ వైపు తిరిగి కొంచెం కోపంగా అన్నది.

భయం నిండిన పెద్దకళ్ళతో క్లాసంతా ఒక్కసారి కలయజూసి, లేచినిలబడింది కాథరీన్. నల్లపిల్ల, తెల్లటి పెద్ద పెద్ద కళ్ళు, నడిపాతదైపోయిన యూనిఫారం గౌను.

"తెల్ల సాక్సు కొనుక్కోమని రెండు రోజులనుంచీ చెబుతున్నాను. ఈవేళా రంగు వే వేసుకొచ్చావు. మదర్‌కి చెప్పాల్సి వసుంది. రేపూ ఇవే వేసుకొస్తే నీకు ఫైన్ వేస్తాం."

టీచరు మాటలకు కాథరీన్ కళ్ళు నీళ్ళతో నిండిపోయి క్లాసు పిల్లల మొహాలన్నీ అలుక్కుపోయినట్లనిపించింది.

"సిట్ డౌన్" ఆజ్ఞాపించింది టీచరు.

బెల్లు మోగింది.

బాక్సు తీసుకుని కాథరిన్ దిగులుగా క్లాసు బయటికొచ్చింది. నిన్న అమ్మనడిగింది. అలిగింది. ఏడిచింది.

"నా దగ్గర ఇప్పుడు పైసలులేవు

బేబీ—జీతం రాగానే కొంటాను—బంగారు తల్లి వి కదూ!" అంటూ తనూ కళ్ళంట నీళ్ళు కార్చింది అమ్మ. అమ్మ హాస్పిటల్లో నర్సు. నాన్న పోయినప్పటినుంచీ అమ్మే ఇల్లు నడుపుతోంది. ఆమె కీ యూనిఫారాలు తప్పితే తక్కిన చీరెలన్నీ చిరుగులతోనే వుంటాయి. పాపం! అమ్మ! "కాథరీన్ – ఓ! కాథరీన్ – " ఉషా బాల రొప్పుతూ వొచ్చి ఆ పిల్ల భుజం మీద చెయ్యి వేసింది.

"ఏమిటలా – వెర్రిదానిలా నడుస్తున్నావు—క్లాసులో ఫస్టు వచ్చావు చక్కగా ప్రోగ్రెస్ కార్డుమీద మీ అమ్మ సంతకం పెట్టించు కొచ్చావు – అబ్బో! అందుకే నీకు గర్వం!" తనేం మాట్లాడుతోందో తనకే అర్థంకాకుండా గబగబ అనేసి, "మా కార్లో దింపేసా వచ్చెయ్—పాపం అంతదూరం నడవొద్దులే – " అంటూ కాథరిన్ చెయ్యి పట్టుకుని లాక్కుపోయింది.

కార్లో కూర్చున్నాక కాథరిన్‌ని చూస్తే జాలేసింది ఉషాబాలకి. ఆ పిల్లని గురించి జాలి పడబోతూండగానే తను ఇంటి దగ్గర కారు దిగగానే వాకిట్లో ప్రత్యక్షం అయ్యే డాన్సు మాస్టారు జ్ఞాపకం వచ్చాడు—ఆ పిల్ల గుండె బెదిరిపోయింది అంతవరకూ రెండు పిరీడ్లూ వరసగా నిలబెట్టి డ్రిల్ చేయించింది టీచరు. కాళ్ళు లాగేస్తున్నాయి – అంతేకాదు—— మాథమాటిక్స్ చెప్పే మిస్ రెండు అభ్యాసాలే ఏకంగా హోంవర్కు ఇచ్చేసింది. ఎల్లుండి తెలుగు మంత్లీ టెస్టు. అసలే తెలుగు తనకి సరిగారాదు—పన్నెండేళ్ళ ఉషాబాల లేత వదనం, వాడిపోయిన చిగురుటాకులా అయిపోయింది.

కారు ఆగడం కాథరిన్ దిగిపోతూ థాంక్స్ చెప్పడం అవేవీ గమనించనే లేదు ఉష. ఆమె అనుకున్నట్లుగా మాస్టారూ, ఆయన తదితరశిష్యబృందం వచ్చి హాలులో ఆసీనులై వున్నారు.

ఇంటికి వచ్చాక ఒక్క నిమిషం ఊపిరి పీల్చుకోనివ్వదు మమ్మీ.

"అదిగో—డైనింగ్ టేబిల్ మీద టిఫినూ, పాలు వున్నాయి. త్వరగా కానిచ్చి. ఆ బటలు మార్చుకుని వెళ్లు." అని ఆజ్ఞ జారీ చేసేసింది.

"ఇవ్వాళ కాళ్లు పీకేస్తున్నాయి." ఏడుపు గొంతుతో భయం భయంగా అంది ఉష.

"నీకు కాళ్లు పీకనిదెప్పుడు? అందుకే బి. కాంప్లెక్సు బిళ్ళలు వేసుకోమంటే వినవు. నీకన్న చిన్నది. వాళ్ళ జయంతి మొన్న లయన్సు క్లబ్బులో ఎంత చక్కగా డాన్సు చేసింది. నీకు రెండేళ్ళ నించీ చెప్పేస్తున్నా. ఇంతమటుకు స్టేజీ మీద ఒక్కసారైనా చేశావా? ఏమిటో నా ఆశేగానీ – నీకు దానిమీద ధ్యాస వుంటేగా! ఎప్పుడెప్పుడు పిల్లల్తో ఆడదామా అని చూస్తుంటావ్! అవకాశం లేనివాళ్ళు, లేదో అని ఏడుస్తుంటే వున్నవాళ్ళకి–" అలా అమ్మ అంటూనే వుంటుంది. బ్యాక్ గ్రౌండు మ్యూజిక్ లాగా.

ఈ లోపున యంత్రంలాగ టిఫినూ, పాలు స్నానం అన్నీ ముగించుకుని గజ్జెలు తీసుకుని,

ఒన్, టూ. త్రీ——తధి గిణ తోం—

''ఏదీ! ఆ స్వరజతి ——" ''రార

వేణుగోపాలాలా—''

''ఇదిగో ఉషా! స్టెప్స్ తప్పు వేస్తున్నావ్ – ఇప్పట్నించే ఏమిటమ్మా ఆ పరధ్యానం–కాస్త చేసే పనిమీద దృష్టి వుంచు – ఆ రాంగ్ స్టెప్స్ చూస్తే అందరూ నన్ను తిడతారు–'' మాష్టారు చింపిరిజుత్తూ, ఎర్రకళ్ళూ వాడూను! చంపేసాడు – వీ డెక్కడ దొరికాడో మమ్మీకి.''

''డాన్స్ చేసే టప్పుడు మొహంలో కోపం వుండకూడదు – శృంగారం వుండాలి – సుకుమారంగా వుండాలి – చిరునవ్వు నవ్వాలి – ఎప్పుడు చూసినా ధుమ ధుమలాడుతూ వుంటావ్—''

శృంగారంట – శృంగారం – ముసి ముసి నవ్వులట! వీడి మొహం చూస్తే నవ్వులొస్తాయా—

''ఇవ్వాళ్టికి చాలు–కాస్త ప్రాక్టీసు చెయ్యి, పది రోజులైనా ఈ ఒక్కటీ రాలేదు– రేపు స్కూల్ ఫంక్షన్‌కి నీ చేత ఈ ఐటమ్ చేయిస్తాను–" దయ చెయ్యి నాయనా దయచెయ్యి– నా చేత డాన్సు చేయిస్తావూ– చేయించవూ మరి! అమ్మ బాబోయ్ ఏడు గంట లైంది– మాథమాటిక్స్ మిస్– తెలుగు మంత్రి బెస్టు– గుణసంధి– సవర్ణదీర్ఘ సంధి– గజేంద్రమోక్షం– ఉషాబాల నీరసంగా చాప మీద కూలబడింది– "నేనూ డాడీ– ఇవ్వాళ మిస్టర్ కృష్ణమణి యింటికి డిన్నర్‌కి పోతున్నాం– హోం వర్కు చేసుకుని వంటావిడ చేత అన్నం పెట్టించుకుని తిని పడుకోండి– గల్లంతు చెయ్యకండి–"

మమ్మీ ఎప్పుడూ ఇంతే! అమ్మయ్య! కారు వెళ్ళిపోయింది–

ఉషాబాల ఇంట్లోంచి బయటి కొచ్చింది– చల్లగా వుంది బయట–

"ఒసేయ్ ఉషా ! అంత్యాక్షరీలు ఆడుకుందాం వస్తావా ? ఎవరుముందు ? నువ్వా ! నేనా ?" గోపాలం వచ్చేడు– అతను పబ్లిక్ స్కూల్లో సెవెన్ క్లాసు చదువుతున్నాడు. ఉష కన్న రెండేళ్ల పెద్దవాడు. అంత్యాక్షరీ పాటలయ్యే సరికి ఎనిమిదైంది.

"ఒరేయ్ నేను ఇరవై లెక్కలు చెయ్యాలి ? ఎలాగ ? ప్లీజ్! మా మంచి అన్నయ్య కదూ ? నువ్వు లెక్కలు బాగా చేస్తావు–కాస్త చేసి పెట్టరా– రేపు మమ్మీ మిల్క్–చాక్లెట్టిస్తానంది – అది నీ కిచ్చేస్తా – ప్లీజ్ – వొరేయ్–"

"నేను చదువుకోవాలి–టైం లేదు–" వెళ్ళిపోబోయాడు 'నీ అంత్యాక్షరీల మూలంగా నే నాకు హోం వర్కు కాలేదు–ప్లీజ్ ఈ సారి ఇంక అడ గనుగా–"

"సరే పద –"

గోపాలం లెక్కలు చేస్తుంటే టేబిల్‌కి ఆనుకుని కూర్చుని, అలా చూసీ చూసీ నిద్రలోకి జారిపోయింది ఉష–అలసిపోయిన మెదడుకీ, శరీరానికీ అప్పుడు విశ్రాంతి !

"అమ్మో–ఉషా! లేఅమ్మా! భోజనం చెయ్యవూ–" వంటావిడ ఎంత లేపినా లేవలేదు, ఆ పిల్ల–

ఆ మరునాడు—

కాథరీన్ ఇంటిదగ్గర కారు ఆపి హారన్ మ్రోగించింది ఉషా బాల–కాథరీన్ బయటికొచ్చింది. కానీ స్కూల్

యూనిఫారంతో కాదు-

"స్కూల్‌కు రావూ !"

"ఊహు....చిరిగిన సాక్సుతో వస్తే టీచర్ కోప్పడుతుంది - రేపు సాక్సు కొనుక్కొని వస్తా___"

అయ్యో పాపం.

రేపే తెలుగు మంత్లీ టెస్టు-కాథరిన్ తన ముందు బెంచీలో కూర్చుంటుంది. ఎంచక్కా వ్రాస్తుంది ! ముత్యాల్లాంటి అక్షరాలతో టెక్స్ట్ బుక్‌లో ఎలా వుందో అలా దించి పారేస్తుంది - ఎంత జ్ఞాపకమో ! తనకి తెలుగు అసలు రాదు.

"మా అమ్మాయికి తెలుగు బాగా రాదండీ!" అని గర్వంగా చెబుతూంటుంది మమ్మీ. - మొన్నటి మంత్లీ టెస్టులో తనకి తెలుగులో నూటికి పదిహేను మార్కు లొచ్చాయి-ప్రోగ్రెస్ మీద రెడ్ మార్కు పడింది - అమ్మ తనని చివాట్లు పెట్టి తెలుగు చెప్పడానికి ఒక ట్యూటర్‌ని పెట్టింది. తను నిద్ర లేవగానే సాక్షాత్కరిస్తాడు. "దా - అమ్మడూ" అంటూను - ముక్కుపొడుం పీల్చుకుంటూ.

"అసలు నీకేం రాదు - సెవెన్త్ చదువుతున్నావ్ - మా తల్లే - ముందు గుణింతాలు నేర్పుతాను పలక కొనుక్కో" అన్నాడు.

మమ్మీకి అందరూ ఇలాంటి వాళ్ళే దొరుకుతారు - రేపు టెస్టులో ప్యాస్ మార్కులైనా రాకపోతే చచ్చే అవమానం-పైగా మమ్మీ తిట్లు ఎలాగ భరించటం ! కాస్సేపు కుదురుగా కూర్చుని చదువుకుందాం అంటే టైం లేదు - ఏమిటో ! ప్చ్ ! వెధవ చదువు ! ఉషా బాల ఆలోచించి ఆలోచించి అలసిపోయింది. అలా అలసిపోయిన ఆమె మెదడులో మెరుపు మెరిసింది.

* * *

తెలుగు మంత్లీ టెస్టునాడు చక్కని క్రొత్త తెల్ల సాక్సువేసుకుని క్లాసుకు వచ్చింది కాథరీన్. కాథరీన్‌కి వస్తువు అంటే చాలా జాగ్రత్త. ఆమె నెలసరీ లంటే చాలా జాగ్రత్త. ఆమె నెల పరీక్షలు జరిగిన వారం రోజులూ సాక్సుని మాసి పోకుండా చాలా జాగ్రత్తగా, ఎప్పుడూ తెల్లగా వుంచింది- పరీక్ష లయి పోయిననాడు సాయంత్రం రూపాయన్నర పెట్టి మిల్క్ చాక్‌లెట్ కొని కాథరీన్‌కి యిచ్చింది ఉషాబాల.

ఈసారి ఉషాబాల టెస్టులన్నీ చాలా బాగా వ్రాసింది- ఎంతో గర్వం వచ్చేసింది ఆ పిల్లకి. రోజూ స్కూల్‌నుంచి ఇంట్లో అడుగు పెట్టగానే ఒక్క క్షణం భయంతో గుండె గుబుక్‌మన్నా, తరువాత హుషారుగా వుండేది- ఆ హుషారులో, డాన్సు మాష్టారు తిట్టినా, తెలుగు మాష్టారు సణిగినా ఆ పిల్లకి వినబడేది కాదు- ఆ రోజు ప్రోగ్రెస్ రిపోర్టు లొచ్చేశాయి- కాథరీన్‌కి ఫస్టు ర్యాంకు, ఎవరికో సెకండు ర్యాంకు, ఉషాబాలకి థర్డు ర్యాంకు !

గతరెండు మూడేళ్లుగా థర్డ్‌ర్యాంకు రావడమనేది ఉషా బాలకి ఎన్నడూ జరగలేదు—గర్వంగా క్లాసు మధ్యనుంచి తల ఎత్తుకు నడిచివెళ్ళి టీచరు దగ్గర్నుంచీ కార్డు అందుకుని చిరునవ్వులు చిందిస్తూ తిరిగి వచ్చింది. అంతకన్న ఉత్సాహంగా ఇంటికి వచ్చింది. కారు

దిగి ఇంట్లో అడుగుపెట్టిందో - లేదో! లోపలనుంచీ మమ్మీ అరుపులు-పనిపిల్ల సుబ్బులు ఏడుపు.

వాకిట్లో డాన్సు మాష్టారూ, ఆయన శిష్యులూ చేష్టలుడిగి నిలబడిపోయారు.

"తిండీ తిప్పలు లేక ముష్టెత్తుకు బ్రతుకుతుంటే - పాపం కదాని నిన్ను తీసుకొచ్చి పనికి పెట్టుకున్నాను. నీకు తినడానికి కంచం కొనిచ్చాను - కట్టుకోడానికి నైలెక్స్ పరికిణీ లిచ్చాను - పడుకోడానికి క్రొత్తచాప కొనిచ్చాను-జ్వరం వస్తే మందిప్పిచ్చాను.సినిమాలకి పంపించాను - ఇంత చేస్తే ఇది ఏ నువ్వు చేసేపని! పనికిమాలినదానా? నీదగ్గర దొంగబుద్ధి వుందని తెలిస్తే చచ్చినా నిన్ను తీసుకొచ్చే దాన్నికాను- నిన్ను నమ్మి టేబిల్ సొరుగు తాళం వేయనందుకు మంచి శాస్తిచేశావు-ఐస్ క్రీం చేస్తే ఐస్‌క్రీం పెట్టాను - లడ్డూలొండితే లడ్డూలు పెట్టాను - మా ఇంటి తిండి నీకు బాగా వంటికి ఎక్కిందే!''

అందరూ తినగా కప్పుల్లో మిగిలిన ఐస్‌క్రీం పోగుచేసి సుబ్బులుకు పెట్టే అమ్మ, తను కట్టీ కట్టీ పాతపడిపోయిన నైలెక్స్ చీరె చించి పరికిణీలు కుట్టించి యిచ్చిన అమ్మ - లడ్డు బూజుపట్టాయని చాలా దయగా సుబ్బులుకిచ్చిన అమ్మ! అమ్మ చేతిలో అన్నయ్య పెట్టుకునే బెల్టు వుంది. సుబ్బులు చేతిమీద ఎర్రటి వాతలున్నాయి.

గడ గడ వణికిపోయింది ఉష! వెక్కిళ్ళు పెడుతోంది సుబ్బులు. కోపంతో ఎగిరెగిరి పడుతోంది రంగనాయకి.

చోద్యం చూసి ఆనందిస్తున్నాడు డాన్సు మాస్టారు.

"నేనేదైనా సహిస్తానుగానీ దొంగబుద్ధిని మాత్రం సహించను. నాకు ఒళ్లు మండిపోతోంది. ఏం చెయ్యనిప్పుడు. ఆయనకితెలిస్తే దీన్నితక్షణం పంపెయ్యమంటారు. ఇది పోతే నేను పని చేసుకోలేనే:" సగం స్వగతంగానూ, సగం ప్రకాశంగానూ అనుకుంటూ, మళ్ళీ సుబ్బులు వైపొకసారి తీక్షణంగాచూసి. "చెప్పవే దొంగ పిల్లా! ఆ పది రూపాయలు ఏం చేశావో చెప్పు. లేకపోతే ఇవ్వాళ నీచర్మం వొలిచేస్తాను!" అంటూ మళ్ళీ బెల్టు ఝుళిపించింది రంగనాయకి.

సుబ్బులు తిన్న దెబ్బలు చూసుంటే ఉషాబాలకి దుఃఖం కెరటాల్లాగా పొంగి వచ్చింది.

"అమ్మా!" అంటూ భావురుమని పెద్దగా ఏడ్చేసింది ఆ పిల్ల.

"అదేమిటే! నువ్వేడుస్తావెందుకూ! పో! అవతలికి, సొరుగులో పది రూపాయలు పోయాయి—వారం, పది రోజులయింది. చూసుకోలేదు. ఇవ్వాళ చూస్తే లేవు-నేను దాన్ని అడుగుతున్నా- నువ్వేళ్ళు-మాస్టారొచ్చారు.''

"ఏమే! మళ్ళీ టెస్టుల్లో తక్కువ మార్కు లొచ్చాయా? ఫరవాలేదులే - వెళ్లు ఏడు పెందుకూ?" రంగనాయకి విసుక్కుంది—

"కాదు మమ్మీ-దాన్ని కొట్టకు - పది రూపాయలు నేను తీశాను-" వెక్కిళ్ళు పెడుతూ చెప్పింది ఉష—

''అడక్కుండా ఎందుకు తీశావ్?'' గర్జించింది రంగనాయకి.

"అడిగితే నువ్వు ఇవ్వవు - నేనూ- కాథరీన్‌కి సాక్ష్య—"

అసలు సంగతి చెప్పడానికి పావు గంట పట్టింది ఉషకి - కాథరీన్‌కి తను సాక్ష్య కొనిస్తే, ఆమె వ్రాస్తూన్న పరీక్ష పేపరు తను చూసేలాగ, ఒక ప్రక్కకి పెడితే - తను చూసి కాపీ చేస్తే....ధర్డ్ ర్యాంకు....

మ్రాన్పడి పోయింది రంగనాయకి!

వెక్కిళ్ళమధ్య బెదురుగా చూస్తున్న ఉషాబాల చేతిలో ప్రోగ్రెస్ కార్డు, ఏడుస్తూ మొహానికి కప్పుకున్న సుబ్బులు చేతులపైన ఎర్రటి వాతలూ, నిన్న సాయంత్రం క్లబ్ సమావేశంలో తాను ఛైల్డ్ సైకాలజీమీద చేసిన ఉపన్యాసం - అన్నీ ఆమెని వెక్కిరిస్తున్నట్లనిపించింది.


అనామిక

ప్రారంభ సంచికకు శుభాకాంక్షలు

★

మాజేటి ఎంటర్ ప్రైజస్

ప్రొ|| మాజేటి రామమోహనరావు

బీడీ, సిగరెట్ అండ్ మ్యాచెస్ హోల్ సేల్

మర్చంట్సు అండ్ ఫ్యాన్సీ రిటైల్ డీలర్సు

రేపల్లె (A. P.)